క్లుప్తంగా

మానసికారోగ్యంపై అవగాహన అవసరం



కొడవలూరు: మానసికారోగ్యంపై అవగాహన అవసరమని కొడవలూరు పీహెచ్‌సీ సీహెచ్‌ఓ సోమశేఖర్ పేర్కొన్నారు. ప్రపంచ మానసికారోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్లకార్డులతో అవగాహన ర్యాలీని గ్రామంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మానసిక ఒత్తిడితో అనేక రకాల ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని చెప్పారు. యోగా, ధ్యానం, వ్యాయామం చేయడం ద్వారా మానసికంగా ఆరోగ్యంగా ఉండొచ్చని సూచించారు. హెచ్‌ఎస్ రామ్మోహన్, హెచ్‌ఎస్‌లు షఫీఉద్దీన్, సుధాకర్, ఎమ్మెల్‌హెచ్‌పీలు సరోజ, స్నేహ, ఏఎన్‌ఎంలు నదియా, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

⇨ **ఇందుకూరుపేట:** మానసికారోగ్యంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని జగదేవిపేట పీహెచ్‌సీ వైద్యాధికారి కిశోర్‌కుమార్ పేర్కొన్నారు. పీహెచ్‌సీ ఆవరణలో కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మానసిక వైద్యంపై అనంతపురం జిల్లా మెంటల్ హెల్త్ టీమ్ డాక్టర్ క్రిస్టినా వివరించారు. డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, క్లినికల్ సైకాలజిస్ట్ రేవతి, హెచ్‌ఈఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

⇨ **కోవూరు:** మండలంలోని పాటూరులో గల ప్రభుత్వ హైస్కూల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కెరీర్, మెంటల్ హెల్త్ కౌన్సెలర్ మధు, ఎంఈఓ రహీమ్,, ప్రధానోపాధ్యాయుడు జుల్ఫికర్ అలీ, ఉపాధ్యాయుడు చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

⇨ **తోటపల్లిగూడూరు:** పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంపొందించాలని జిల్లా ఆరోగ్య సర్వైలెన్స్ అధికారి డాక్టర్ భాస్కర్ సూచించారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా తోటపల్లిగూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ పిల్లలకు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం ముఖ్యమన్నారు. మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంచాలన్నారు. మానసిక పరిపక్వత లేకనే విద్యార్థులు చిన్న వయస్సులోనే ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి వేణుగోపాలరెడ్డి, హెల్త్ కౌన్సిలర్ జ్యోతిర్మయి, ఎడ్యుకేషన్ టీచర్ రామచంద్రయ్య, పాఠశాల ఇన్‌చార్జి సుబ్బారెడ్డి, ఎల్‌ఈపీ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



కార్యక్రమంలో పాల్గొన్న సీడీపీఓ

మనుబోలు: పోషక విలువలున్న ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండొచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఆదినారాయణమ్మ, పద్మజ అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మనుబోలు బాలికల ఉన్నత పాఠశాలలో బాలికలకు క్రీడా పోటీలు నిర్వహించారు. పౌష్టికాహారం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణవేణి, పీఈటీ ప్రతిమ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

వచ్చే సీజన్లోనైనా ముందే ఏర్పాటు చేయండి

- మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల డిమాండ్

కొడవలూరు: ఎడగారులో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆలస్యంగా ఏర్పాటు చేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, వచ్చే సీజన్లోనైనా ముందే పెట్టాలని సభ్యులు డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ జ్యోతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇక నుంచి పొరపాట్లు చోటుచేసుకుండా ముందే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేలా చూస్తామని గుండాలమ్మపాళెం సొసైటీ అధ్యక్షుడు బద్వేలు వినీల్‌రెడ్డి హామీ ఇచ్చారు. మండలంలో వివిధ సమస్యలపై సభ్యులు ఏకరువు పెట్టారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించాక ఆర్టీసీ బస్సులు రద్దీగా ఉండటంతో వివిధ గ్రామాల నుంచి కొడవలూరు హైస్కూల్‌కు వచ్చే విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. సమస్యను ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఎంఈఓ వసంతకుమారి హామీ ఇచ్చారు. అనంతరం జ్యోతి మాట్లాడారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యలను సకాలంలో పరిష్కరించాలని కోరారు. ఉపాధి ఏపీఓ అచ్చయ్య, విద్యుత్ శాఖ ఏఈ రాములు, ఎంపీడీఓ సుబ్బారావు, తహసీల్దార్ స్ఫూర్తిరెడ్డి, వైస్ ఎంపీపీ మారంరెడ్డి సుజాతమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నిర్మల, నాగభూషణమ్మ, సర్పంచ్‌లు నల్లావుల శ్రీనివాసులు, నవీన్, రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

రాంగ్‌రూట్‌లో రాకపోకలు సాగిస్తూ..





ప్రమాదమని తెలిసినా.. అదే నిర్లక్ష్యం

నిర్లక్ష్యపు డ్రైవింగ్, అతివేగంతో అనేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రాణాలను పలువురు కోల్పోతుండగా, ఎందరో క్షతగాత్రులవుతున్నారు. ఇలాంటి వారితో ఇతరులూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ద్విచక్ర వాహనాలను నడుపుతూ సెల్‌ఫోన్లో మాట్లాడకూడదని.. ట్రిబుల్ రైడింగ్ చేయరాదని.. మైనర్లు వాహనాలు నడపరాదని తెలిసినా ఆచరణలో ఏ మాత్రం పట్టించుకోవడంలేదు. నగరంలో పలువురు ద్విచక్రవాహనదారులు నిబంధనలు యథేచ్ఛగా ఉల్లంఘించి వాహనాలు నడుపుతున్న దృశ్యాలివీ. పోలీసులు పదేపదే హెచ్చరికలు జారీచేస్తున్నా, వారిలో కనీస స్పందన కరువైంది.

– నెల్లూరు(క్రైమ్)





సెల్‌ఫోన్లో మాట్లాడుతూ.. డ్రైవింగ్ చేస్తూ..

విద్యార్థులకు పలకల పంపిణీ



నెల్లూరు(వీఆర్సీసెంటర్): సినీ నటుడు అలీ జన్మదినాన్ని పురస్కరించుకొని వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ మున్సిపల్ పాఠశాలలో విద్యార్థులకు పలకలు, పండ్లను శుక్రవారం పంపిణీ చేశారు. దివ్యాంగుల ఐక్య సంఘ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కేక్‌ను కట్ చేశారు. ఐక్య సంఘ జిల్లా అధ్యక్షుడు సనావుల్లా, ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి, అలియా, మల్లీశ్వరి, శీనయ్య, వేణు, జక్కావుల్లా, సమీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని పలు సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా శనివారం ఉండదని నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటేశ్వరపురం సబ్‌స్టేషన్ పరిధిలోని జనార్దన్‌రెడ్డికాలనీ, టిడ్కో గృహ సముదాయం, గాంధీ గిరిజన కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని వివరించారు.

➡ డీఎస్సార్ సబ్‌స్టేషన్ పరిధిలోని జెడ్పీ కాలనీ, పోస్టల్ కాలనీ, పద్మావతి సెంటర్ తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు.. కోటమిట్ట సబ్‌స్టేషన్ పరిధిలోని వాకర్స్ రోడ్డు, వీబీఎస్ కల్యాణ మండపం, ఖుద్దూస్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు.

➡ రాజేంద్రనగర్, రంగనాథ సబ్‌స్టేషన్ల పరిధిలోని ఇసుకడొంక, రంగనాయకులపేట, రైల్వేఫీడర్స్ రోడ్డు, సంతపేట, మనుమసిద్ధినగర్, పరమేశ్వరినగర్, వాకర్స్ రోడ్డు, సంతపేట, అగ్నిపేట తదితర ప్రాంతాలు.. ఏకేనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని రిత్విక్ ఎన్‌క్లేవ్, గాయత్రినగర్, సావిత్రినగర్ మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

➡ పడారుపల్లి, సుందరయ్యకాలనీ సబ్‌స్టేషన్ల పరిధిలోని సప్తగిరి కాలనీ, రాజు కాంప్లెక్స్, బీవీనగర్ సెంటర్, ఆర్టీఏ కార్యాలయ రోడ్డు, పడారుపల్లి, సుందరయ్యకాలనీలోని ఏ, బీ, సీ, డీ బ్లాకులు, లెక్చరర్స్ కాలనీ, మాగుంట లేఅవుట్ తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని తెలిపారు.

ముగిసిన సీఎం పర్యటన



నెల్లూరు(క్రైమ్): పటిష్ఠ బందోబస్తు నడుమ సీఎం చంద్రబాబు జిల్లా పర్యటన శుక్రవారం ముగిసింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు విధులను సమర్థంగా నిర్వహించిన పోలీస్ అధికారులు, సిబ్బందిని ఎస్పీ అజిత వేజెండ్ల అభినందించారు.

నెల్లూరు రూరల్: సీఎం చంద్రబాబు జిల్లా పర్యటనను విజయవంతంగా నిర్వహించిన అధికార యంత్రాంగం తదితరులకు కలెక్టర్ హిమాన్షు శుక్లా అభినందనలను తెలియజేశారు. ఈ మేరకు ప్రకటనను విడుదల చేశారు.

మానసికారోగ్య దినోత్సవం



మాట్లాడుతున్న డొమినిక్‌రెడ్డి

నెల్లూరు(బృందావనం): పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ భవనంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. తొలుత మానసికారోగ్యంపై ప్రదర్శనను చేపట్టారు. అనంతరం డొమినిక్‌రెడ్డిని సత్కరించారు. సంస్థ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమేష్‌బాబు, కర్లపూడి కృష్ణ, డాక్టర్ సురేష్‌బాబు, కిరణ్‌కుమార్, కృష్ణ, నరసింహమూర్తి, కోదండరామ్, రమేష్‌బాబు, చంద్రశేఖర్, నళిని తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ జట్ల ఎంపిక



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లా స్కూల్ గేమ్స్ అండర్ – 17 బాలబాలికల ఫుట్‌బాల్ జట్లను నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శుక్రవారం ఎంపిక చేశారు. అండర్ – 17 విభాగంలో ఎంపికలకు క్రీడాకారులు హాజరయ్యారు. ఎస్జీఎఫ్ కార్యదర్శులు రమణయ్య, దేవిక తదితరులు పాల్గొన్నారు.

కోడిగుడ్ల పంపిణీ



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ప్రపంచ కోడిగుడ్డు దినోత్సవాన్ని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉడకబెట్టిన కోడిగుడ్లను 500 మందికి బెజవాడ సునీల్‌రెడ్డి దాతృత్వంతో అందజేశారు. నెక్ మాజీ జోనల్ చైర్మన్ నలుబోలు బలరామయ్యనాయుడు, అసోసియేషన్ ట్రెజరర్ మాగంటి ప్రసాద్, ఏకొల్లు రాఘవరెడ్డి, నజీర్ అహ్మద్, బెల్లం చెంచయ్యనాయుడు, పత్తిపాటి రమణయ్య, హరిబాబు నాయుడు, సదానందరెడ్డి, శివయ్య, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ బకాయిలను వెంటనే విడుదల చేయాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ప్రైవేట్ ఆస్పత్రులకు ఎన్టీఆర్ వైద్యసేవలు (ఆరోగ్యశ్రీ) పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశావారు. బకాయిలను విడుదల చేయకపోవడంతో వైద్యసేవలను నిలిపేస్తున్నామని ఏపీ సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రుల అసోసియేషన్ ప్రకటించిందని, దీంతో పేదలకు ఇబ్బంది ఏర్పడే అవకాశం ఉందని చెప్పారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో శుక్రవారం భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండిపోయాయి. భక్తులు వేచి ఉన్న క్యూ శిలాతోరణం వద్దకు చేరుకుంది. గురువారం అర్ధరాత్రి వరకు 66,883 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. 26 వేల మంది భక్తులు తలనీలాలు అర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.15 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారు స్వామిని దర్శించుకునేందుకు 24 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు కలిగిన వారికి మూడు గంటల్లోనే దర్శనం లభిస్తోంది. సర్వదర్శన టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని, ముందుగా వెళ్లిన భక్తులను అనుమతించరని టీటీడీ స్పష్టం చేసింది.

తోపుడు బండి అందజేత



నెల్లూరు (టౌన్): నగరంలోని 19వ డివిజన్లో గల ముత్యాలపాళేనికి చెందిన జూగుంట నారాయణమ్మకు తోపుడు బండిని కార్పొరేటర్ భర్త మదన్‌కుమార్‌రెడ్డి శుక్రవారం అందజేశారు. పేదరికంలో ఉన్న ఆమెకు దీన్ని అందజేశానని ఆయన చెప్పారు.

డీఎస్డీఓగా పాండురంగారావు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లా క్రీడాభివృద్ధి అధికారి (డీఎస్డీఓ)గా నెల్లూరు ఫుట్‌బాల్ కోచ్ పాండురంగారావును నియమిస్తూ ఉత్తర్వులను ప్రభుత్వం శుక్రవారం రాత్రి జారీ చేసింది. జిల్లా క్రీడాభివృద్ధి అధికారిగా విధులు నిర్వర్తిస్తూ ఈ నెలాఖరులో ఉద్యోగ విరమణ పొందనున్న యతిరాజ్‌ను నెల్లూరు ఖోఖో కోచ్‌గా నియమించారు.

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం

మనుబోలు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా జరిగింది. దీనికి ఆరోగ్య, ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు గైర్హాజరవడంతో ఎంపీపీ వజ్రమ్మ అసహనం వ్యక్తం చేశారు. గైర్హాజరైన వారికి నోటీసులు జారీ చేయాలని ఎంపీడీఓ జలజాక్షిని ఆదేశించారు. సమావేశానికి విచ్చేసిన ఆర్టీసీ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావును ప్రజా ప్రతినిధులు నిలదీశారు. అవసరమైన చోట కాకుండా పోలీస్‌స్టేషన్ ఎదురుగా బస్సులు ఆపడం ఏమిటని ప్రశ్నించారు. అలాగే ఉచిత బస్సు అని చెప్పి మహిళలను కండక్టర్లు హేళన చేస్తున్నారని మండిపడ్డారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఎంసీ చైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మనిర్భర్ భారతే లక్ష్యం



మాట్లాడుతున్న బీజేపీ నేతలు

నెల్లూరు రూరల్: ఆత్మనిర్భర్ భారతే లక్ష్యంగా ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి స్వదేశీ వస్తువులను వినియోగించేలా ప్రతి ఒక్కరూ మద్దతివ్వాలని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు సూర్యనారాయణరాజు పేర్కొన్నారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఆత్మనిర్భర్ భారత్, స్వయం సమృద్ధి భారత్ పేరుతో కార్యాచరణను డిసెంబర్ 25 వరకు నిర్వహించనున్నామని వివరించారు. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్‌రాజు, పార్టీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని పర్యవేక్షించాలి



ఏడీకి వినతిపత్రమిస్తున్న నేతలు

నెల్లూరు (టౌన్): నగరంలోని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పర్యవేక్షించాలని ఆలిండియా డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు వరుణ్ కోరారు. ఈ మేరకు నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏడీ గ్లోరీ కుమారికి వినతిపత్రాన్ని శుక్రవారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. డీఈఓ స్వయంగా వెళ్లి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించాలని కోరారు. సుదీప్, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



నెల్లూరు (టౌన్): మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తుకు ముప్పుగా పరిణమిస్తుందని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌బాబు పేర్కొన్నారు. మాదకద్రవ్యాల వినియోగం, దుష్ప్రభావాలపై నగరంలోని కృష్ణచైతన్య డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను నిర్వహించారు. ఎస్సై ప్రభాకర్, కళాశాల డీన్ సుధారాణి, నిరుపమ, డీ అడిక్షన్ సెంటర్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రవీంద్ర, కానిస్టేబుల్ ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

బాలికలపై వివక్ష తగదు



మాట్లాడుతున్న సుజాత

నెల్లూరు (టౌన్): బాలికలపై వివక్ష చూపడం తగదని డీఎంహెచ్‌ఓ సుజాత పేర్కొన్నారు. దర్గామిట్టలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన అంతర్జాతీయ బాలిక దినోత్సవంలో ఆమె మాట్లాడారు. లింగ నిష్పత్తిలో రాష్ట్రంలో జిల్లా నాలుగో స్థానంలో ఉందన్నారు. అనంతరం సేవ్ ది గర్ల్‌పై వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలను నిర్వహించి, విజేతలకు నగదు బహుమతులతో పాటు ప్రశంసపత్రాలను అందజేశారు. డీఐఓ ఉమామహేశ్వరి, డిప్యూటీ డీఈఓ వెంకటేశ్వరనాయక్, పీసీ అండ్ పీఎన్డీటీ జిల్లా కమిటీ సభ్యులు కుసుమకుమారి, శ్రీనివాసరావు, డీపీఎంఓ రమేష్, డీఎంఓ హుస్సేనమ్మ, హెడ్‌మాస్టర్ జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.

పొగాకు వినియోగంతో అనర్థాలు



నెల్లూరు(అర్బన్): పొగాకు ఉత్పత్తులను వినియోగించడం ద్వారా కేన్సర్ లాంటి వ్యాధులొస్తాయని డీఎంహెచ్‌ఓ సుజాత పేర్కొన్నారు. పొగాకు రహిత యువత కోసం ప్రచార కార్యక్రమాన్ని పలు పాఠశాలల్లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంతపేట వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పొగాకు ఉత్పత్తులకు యువత దూరంగా ఉండేలా 60 రోజుల పాటు అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నామని వివరించారు. ఎన్సీడీ అధికారి డాక్టర్ యశ్వంత్, హాసిని తదితరులు పాల్గొన్నారు.

కీటక జనిత వ్యాధుల నివారణకు కృషి



నెల్లూరు(అర్బన్): కీటక జనిత వ్యాధుల నివారణకు వైద్య సిబ్బంది కృషి చేయాలని మలేరియా నివారణ సహాయాధికారి నాగార్జునరావు సూచించారు. ఉస్మాన్‌సాహెబ్‌పేటలో అనుమానిత డెంగీ కేసు నమోదైన నేపథ్యంలో ఆ ప్రాంతంలో చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. లార్వా ఆపరేషన్, ఫీవర్ సర్వేను తనిఖీ చేశారు. దోమల నివారణకు కాలువల్లో స్ప్రేయింగ్‌ను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. పరిశుభ్రత ఉంటే వ్యాధులు దరిచేరవన్నారు. మలేరియా విభాగ ఎస్‌యూఓ శ్యామ్‌సన్‌బాబు, సిబ్బంది శ్రీధర్, వెంకటేశ్వర్లు, నందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులపై శిక్షణ



మాట్లాడుతున్న లలితా శివజ్యోతి

నెల్లూరు(పొగతోట): వరిలో సమగ్ర యాజమాన్య పద్ధతులపై తిక్కవరప్పాడు రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నగరంలో శుక్రవారం నిర్వహించారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కేవీకే సమన్వయకర్త లలితా శివజ్యోతి మాట్లాడారు. భూసార పరీక్షలను తప్పక చేయించుకొని వాటి ఫలితాల ఆధారంగా ఎరువులను వినియోగించాలని సూచించారు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో నాణ్యమైన విత్తనాలనే ఎంచుకోవాలని కోరారు. చౌడు సమస్య ఉన్న నేలల్లో ఎమ్మెస్ఎమ్ 103 సన్న బియ్యం రకాన్ని సాగు చేయడం ఉత్తమమని చెప్పారు. అనంతరం బీపీటీ – 5204, ఎమ్మెస్ఎమ్ – 103 వరి విత్తనాలను పంపిణీ చేశారు.

భక్తిశ్రద్ధలతో రాహుకాల పూజలు



విశేషాలంకారంలో అమ్మవారు



పూజలకు హాజరైన మహిళలు

నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో రాహుకాల ఉద్యాపన పూజలను భక్తిశ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. 42 మంది హాజరై అమ్మవారికి చీర, జాకెట్టు, 108 నిమ్మకాయ మాలలను సమర్పించారు. సర్వాలంకార శోభితంగా కొలువైన అమ్మణ్ణిని భక్తులు దర్శించుకొని ప్రణమిల్లారు. భక్తుల విరాళంతో రెండు వేల మందికి అన్నప్రసాదాన్ని అందజేశారు. వేదపారాయణం, సంధ్యామేళం, కుంభహారతులు, పల్లకిసేవను విశేషంగా నిర్వహించారు. ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి, ప్రధానార్చకుడు సూరావఝుల రఘురామమూర్తి తదితరులు పర్యవేక్షించారు.